క్లుప్తంగా

మొక్కలను సంరక్షించాలి



పాన్‌గల్: ఎండలు ముదురుతున్న నేపథ్యంలో హరితహారంలో నాటిన మొక్కలు ఎండకుండా జాగ్రత్తలు తీసుకుంటూ క్రమం తప్పకుండా నీరు పట్టాలని ఏపీఓ కుర్మయ్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని అన్నారం గ్రామాన్ని సందర్శించి రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలకు నీరు పట్టారు. దీంతో పాటు నర్సరీల్లోని మొక్కల సంరక్షణకు గ్రీన్ నెట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

క్షయ నిర్ధారణ పరీక్షలు



పాన్‌గల్: క్షయ వ్యాధిరహిత మండలంగా మార్చేందుకు గ్రామానికి వచ్చి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలో ప్రజలకు క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వ్యాధిగ్రస్తులకు నిశ్చయ్ పోషణ్ యోజన, ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కింద పౌష్టికాహారం తీసుకోవడానికి నెలకు రూ.1000 అందజేస్తారన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రామయ్య, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యులు తారశశాంక్, లక్ష్మీనారాయణ, ఖాజా, సురేందర్, మధుబాబు, సతీష్‌కుమార్, సరళ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించండి

ఆత్మకూర్: పట్టణ ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ శశిధర్ అన్నారు. శుక్రవారం సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి పన్నులు వసూలు చేశారు. పన్నులు చెల్లించని మూడు షాపులను సీజ్ చేసారు. ఈఏడాది పన్నుల వసూలు లక్ష్యం రూ.2.39 కోట్లకు గాను ఇప్పటివరకు రూ.1.23 కోట్లు వసూలు కాగా.. సుమారు రూ.1.16 కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి

అమరచింత: రంజాన్ మాసం పురస్కరించుకొని పండుగ రోజు నిర్వహించే ఈదుల్‌ఫితర్ నమాజు కోసం ఈద్గా వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని కోరుతూ మసీదు కమిటీ సభ్యులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రవిబాబుకు వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా మసీద్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ పట్టణంలోని ఈద్గా ప్రదేశంతో పాటు మసీదుల వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరినట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ స్పందిస్తూ పరిసరాల పరిశుభ్రపై వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అన్సారీ, తౌఫిక్, పాషా, సోనిఅక్బర్, ఖాసీం, అస్సు, నిసార్ పాల్గొన్నారు.

కాల్వ మట్టి అక్రమ తరలింపు



వనపర్తి రూరల్: ధనార్జనే ధ్యేయంగా అక్రమార్కులు కొండలు, గుట్టలు, కాల్వల వెంటనున్న మట్టిని కొల్లగొడుతున్నారు. మండలంలోని దత్తాయిపల్లి పెద్దతండా గ్రామానికి సమీపంలో కాల్వ తవ్విన మట్టి గుట్టలను శుక్రవారం కొందరు వ్యక్తులు అనుమతులు లేకుండా యథేచ్ఛగా గ్రామాలకు తరలిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ మట్టి తవ్వకాలు ఆపాలని ప్రజలు కోరుతున్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

మదనాపురం: స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థులకు శుక్రవారం వార్షిక పరీక్షలు ఉన్నందున వార్డెన్ బెనర్జీ స్టడీ మెటీరియల్, ఎగ్జామ్ ప్యాడ్లు, గ్రాఫ్ బుక్, మ్యాప్ పెయింటింగ్ బుక్, డిక్షనరీ, పరీక్షకు కావాల్సిన పరికరాలు పంపిణీ చేశారు. మార్చి వరకు కాస్మోటిక్ చార్జీలు అందజేశారు.

ప్యాడ్లు, పెన్నులు..

మండల కేంద్రంలో కేజీబీవీ 10వ తరగతి విద్యార్థులకు శుక్రవారం బీసీ పొలిటికల్ జేఏసీ మండల అధ్యక్షుడు మహేందర్ ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల కన్నా మెరుగైన విద్య అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బాలరాజ్, షేక్ అశోక్, చంద్రశేఖర్, రాజవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



తొలిరోజు ప్రశాంతంగా..

సాక్షి, నెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా శుక్రవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రాల వద్ద అధికారులు విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు సమకూర్చారు. పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేశారు. సిట్టింగ్ స్క్వాడ్‌లు పరీక్షా కేంద్రాల వద్దే ఉండి మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకున్నారు. పరీక్షా కేంద్రాలను కలెక్టర్, డీఎస్పీ, తహసీల్దార్లు, ఎంఈఓలు నిరంతరం పర్యవేక్షించారు.

- కొత్తకోట పట్టణ కేంద్రంలో ఐదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. భారతీయ విద్యామందిర్ హైస్కూల్‌లో 177మంది విద్యార్థులకు గానూ అందరూ హాజరు కాగా, బెస్ట్ గ్రామర్ హైస్కూల్‌లో 200మందికి 199మంది విద్యార్థులు, ఉషోదయ హైస్కూల్‌లో 199మంది విద్యార్థులకు గానూ మొత్తం విద్యార్థులు, నివేదిత హైస్కూల్‌లో 210మంది విద్యార్థులకు గానూ మొత్తం విద్యార్థులు హాజరయ్యారు. ఢిల్లీ హైస్కూల్‌లో 210మంది మంది విద్యార్థులకు గానూ 209మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు ఎంపీఈఓ కృష్ణయ్య తెలిపారు. పట్టణంలోని ఐదు పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డీసీఆర్‌బీ డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ రాంబాబు, ఎస్ఐ ఆనంద్‌లు వేరువేరుగా పరిశీలించారు.



జిల్లాకేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులు

- పెద్దమందడి మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 164మంది విద్యార్థులకు గానూ 163మంది, జెడ్పీహెచ్ఎస్‌లో 200మంది విద్యార్థులకు గానూ అందరూ పరీక్ష రాసినట్లు ఎంఈఓ బాణం విష్ణు తెలిపారు. స్థానిక ఎస్ఐ యుగంధర్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.
- అమరచింత మండల కేంద్రంలోని డీఎంఆర్ఎం, జెడ్పీ ఉన్నత పాఠశాల రెండింటిలో కలిపి 253 మంది విద్యార్థులకు గాను 252 మంది హాజరైనట్లు ఎంఈఓ భాస్కర్ సింగ్ తెలిపారు. కేంద్రాలను సీఐ శివకుమార్, ఎస్ఐ సురేష్ తనిఖీ చేశారు.
- చిన్నంబావి మండలంలోని పెద్దదగడ జిల్లా పరిషత ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. మొదటి రోజు పరీక్షకు 194మంది విద్యార్థులకు గాను వంద శాతం పరీక్ష రాశారని చీఫ్ సూపరింటెండెంట్ ఆనంద్‌రెడ్డి తెలిపారు.
- వీపనగండ్ల మండల కేంద్రంలో మొదటి రోజు 141 మందికి గాను 140 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ రమణమ్మ, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ స్వామి తెలిపారు.
- ఖిల్లాఘనపురం బాలికల ఉన్నత పాఠశాలలో 230 మంది విద్యార్థులకు గాను 229 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 213 మందికి అందరూ హాజరైనట్లు ఎంఈఓ జయశంకర్ తెలిపారు.
- పాన్‌గల్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 210 మంది విద్యార్థులు, బాలికల ఉన్నత పాఠశాలలో 139 మంది కలిపి మొత్తం 349 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు అజీమ్‌పాష, విజయలక్ష్మి, డిపార్టుమెంటల్ ఆఫీసర్లు రాజవర్ధన్‌రెడ్డి, మంజుల తెలిపారు. పరీక్ష కేంద్రాలను ప్రభుత్వ పరీక్షల విభాగం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ గణేష్‌కుమార్, ఎంఈఓ శ్రీనివాసులు పరిశీలించారు.
- గోపాల్‌పేట జిల్లా పరిషత్ (బాలుర) పాఠశాలలో 220 మంది, బాలికల పాఠశాలలో 175 మంది, రేవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 179 విద్యార్థులకు గాను 178 మంది విద్యార్థులు హాజరయ్యారు. రేవల్లి పరీక్ష కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్, తహసీల్దార్ లక్ష్మీదేవి, ఎంఈఓ బాల్‌రెడ్డి పరిశీలించారు.



ఆత్మకూర్‌లో..



భారతీయ విద్యామందిర్ స్కూల్ వద్ద డీసీఆర్‌బీ డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, ఎస్ఐ



ఖిల్లాఘనపురం బాలికల ఉన్నత పాఠశాల వద్ద..



అమరచింత జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద..



కొత్తకోటలో..



గోపాల్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

విద్యార్థిని అదృశ్యం: కేసు నమోదు

పాన్‌గల్: విద్యార్థి అదృశ్యమైన ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిక్కేపల్లి చెందిన 17 ఏళ్ల బాలిక జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతుంది. విద్యార్థిని పది రోజుల నుంచి గ్రామంలో ఇంటి వద్దే ఉంటుంది. గురువారం అమ్మాయితో పాటు ఇంట్లో ఆమెకు సంబంధించిన దుస్తులు, చదువుకు సంబంధించిన ధ్రువపత్రాలు, కొంత నగదు కనపించలేదు. అప్పటి నుంచి బంధువుల ఇళ్లు, చుట్టుపక్కల తెలిసిన వారి, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. విద్యార్థిని అదృశ్యం వెనుక తమ బంధువైన కదిరెపాడు గ్రామానికి చెందిన బోయ మహేష్‌పై అనుమానం ఉందని విద్యార్థిని తల్లి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

నూతన లెక్చరర్లకు సన్మానం



వనపర్తి విద్యావిభాగం: టీజీపీఎస్సీ ద్వారా ఇటీవల నియమితులైన 36మందిలో 30మంది లెక్చరర్లు విధుల్లో చేరారు. విధుల్లో చేరిన అధ్యాపకులకు జూనియర్ కళాశాల జిల్లా లెక్చరర్స్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనస్వాగతం పలికారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎర్ర అంజయ్య ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు ఒకరినొకరు పరిచయం చేసుకుని వారి వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా డీఐఈఓ నూతన అధ్యాపకులకు 'గ్రీన్ పెన్' బహుకరించారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

వనపర్తి: అక్రమ లే అవుట్ యజమానులు, ప్లాట్ యజమానులు త్వరగా మేల్కొని ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణ చేయించుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. శుక్రవారం సాయంత్రం జిల్లాల వారీగా ఎల్‌ఆర్‌ఎస్ పురోగతిపై హైదరాబాద్ మున్సిపల్ డెవలప్మెంట్ అథారిటీ ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిషోర్ కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంతకు ముందు 47,974 మంది ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకోగా.. డబ్బులు చెల్లించాలని వారిలో 37,401 మంది ప్లాటు యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్ లేని ప్లాటు యజమానులు 1,217 మంది ఇప్పటి వరకు డబ్బులు కట్టినవారికి ప్లాటు క్రమబద్ధీకరణ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. అక్రమ లే అవుట్ స్థలాలపై చర్యలు సైతం తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పుడు ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణ చేయించుకునే వారికి 25 శాతం రాయితీ ఇస్తున్నట్లు వెల్లడించారు. మార్చి 31 తర్వాత అక్రమ లే అవుట్లను ప్లాట్లుగా గుర్తించమని స్పష్టంచేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు

కొత్తకోట: అక్రమ అరెస్టులతో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమాలను ఆపలేదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ అన్నారు. శుక్రవారం భవన రంగ కార్మికుల సమస్యలపై చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న వారిని పోలీసులు అడ్డుకొని అక్రమంగా అరెస్టు చేయడం సబబు కాదన్నారు. 60 ఏళ్లు నిండిన బిల్డింగ్ కార్మికుడికి పెన్షన్ రూ.10 వేలు, వారి పిల్లల చదువుల కోసం స్కాలర్‌షిప్‌లు వర్తింపజేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న రూ.11 లక్షల లేబర్ ఇన్సూరెన్స్ కార్డులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ హైదరాబాద్‌లో కమిషనర్ ఆఫీస్ ముట్టడికి వెళ్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. అరెస్టు అయిన వారిలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు కావలి చిన్నవెంకటయ్య, మండల కార్యదర్శి పోతులపల్లి కురుమూర్తి ఉన్నారు.

వీపనగండ్ల: ప్రజలు, విద్యార్థులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శాంతియుతంగా ఆందోళనలను నిర్వహించేందుకు వెళ్తున్న వారిని పోలీసులు అరెస్ట్ చేయడం అన్యాయం అని సీఐటీయూ మండల నాయకులు ఆశన్న ఆరోపించారు. శుక్రవారం బిల్డింగ్ వర్కర్స్ సమస్యల పరిష్కారం చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న కార్మికులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని వాపోయారు. పోలీసుల అదుపులో వెంకటేశ్వర్లగౌడ్, లక్ష్మణ్, రాముడు, రఘు, రామన్‌గౌడ్ ఉన్నారు.



కొత్తకోటలో పోలీసుల అదుపులో నాయకులు

'రిలయన్స్ స్మార్ట్'లో హైడ్రామా

వనపర్తిటౌన్: వనపర్తి రిలయన్స్ ఈ-స్మార్ట్‌లోని పలు తినుబండరాల్లో ఫంగస్, పురుగులు వచ్చాయని వినియోగదారులు చేసిన ఫిర్యాదు మేరకు స్మార్ట్‌లో శుక్రవారం రాత్రి వరకు హైడ్రామా చోటు చేసుకుంది. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నీలిమ తెలిపిన కథనం మేరకు.. రిలయన్స్ స్మార్ట్‌లోని పిజ్జా, పెరుగు, పండ్లు, పచ్చళ్లు తదితర తినుబండరాల్లో ఫంగస్, పురుగులు ఉన్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో రాజకీయ, అఖిలపక్షం నాయకులు, వినియోగదారులు పెద్ద ఎత్తున రావడంతో స్మార్ట్‌లో ఆందోళన చోటు చేసుకుంది. వినియోగదారులు, నాయకులు రిఫ్రిజిరేటర్‌లో ఉన్న పలు తినుబండరాలను తీసి అధికారులకు చూయించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి తనిఖీలు చేస్తున్నామని, అందులో ఎక్స్‌పైరీ డేట్ ఉంటే వదిలేశామని ఫుడ్ ఇన్స్‌పెక్టర్ నీలిమ తెలిపారు. ఎక్స్‌పైరీ డేట్ ఉన్న వాటిని డైరెక్ట్‌గా ఓపెన్ చేసి తనిఖీ చేసే అధికారం తమకు ఉండదని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్ శివకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, జవాన్లు తదితరులు స్మార్ట్‌కు చేరుకోవడంతో వినియోగదారులు వారిని నిలదీశారు. ఈ దశలో ఆందోళన ఉధృతం కావడంతో స్టోర్‌ను మూసి.. అరగంట తర్వాత తెరిచారు. ఇది ఇలా ఉండగా శుక్రవారం రాత్రి 9గంటలకు తహసీల్దార్ రామిరెడ్డి, ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ ఫంగస్, పురుగులు వచ్చిన పదార్థాలను పరిశీలించి రిఫ్రిజిరేటర్‌లో ఉన్న వాటిని అమ్మకూడదని ఆదేశాలు జారీ చేయడంతో పాటు నోటీసులు అందించినట్లు తెలిపారు. ఫంగస్ వచ్చిన పదార్థాలను ల్యాబ్‌కు పంపామని, నివేదిక రాగానే తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. దీనిపై స్టోర్స్ మేనేజర్ రామకృష్ణ మాట్లాడుతూ.. వినియోగదారుడు ఫిర్యాదు చేసిన ప్రొడక్ట్‌పై గడువు తేదీ 2026 మే వరకు ఉంది. వాటిని మేము ఓపెన్ చేసి చూడలేం. లోపం జరిగిందని వినియోగదారుడు చెప్పినందుకు డబ్బులు తిరిగి ఇచ్చాం. ఇలాంటి పొరపాట్లు ఎప్పుడు జరగనివ్వం. వినియోగదారులకు నాణ్యమైన వస్తువులు అందించడమే తమ లక్ష్యమన్నారు.



ఫంగస్ వచ్చిన పదార్థాలను పరిశీలిస్తున్న అధికారులు, వినియోగదారులు

బైక్ చోరీ

కొత్తకోట రూరల్: ఇంటి పక్కన గల ఖాళీ స్థలంలో నిలిపిన కేటీఎం బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించిన ఘటన కొత్తకోట పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ ఆనంద్ తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా, బాల్కీ గ్రామానికి చెందిన రవీంద్ర పట్టణ కేంద్రంలో భవనమ్మ ఆలయం సమీపంలో ఓ ఇంట్లో కుటుంబంతో కలిసి అద్దెకు ఉంటూ.. ఈనెల 20న బైక్‌ను ఇంటి పక్కన గల ఖాళీ స్థలంలో నిలిపాడు. శుక్రవారం ఉదయం డ్యూటీకి వెళ్లేందుకు బైక్‌ను నిలిపిన దగ్గరికి వెళ్లి చూడగా బైక్ కనిపించలేదు. దీంతో రవీంద్ర బైక్ చోరీకి గురైనట్లు నిర్ధారించుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఆనంద్ తెలిపారు.

ముగిసిన ఈదమ్మ జాతర



గోపాల్‌పేట: చెన్నారం ఈదమ్మ ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన వాలీబాల్, కబడ్డీ, చిన్నబండ, పెద్దబండలాగుడు పోటీల్లో ప్రతిభ కనబర్చిన జట్లకు సీఐ కృష్ణ, ఎస్ఐ రాము బహుమతులు అందించారు. వాలీబాల్ మొదటి బహుమతిని సింగోటం గెలుచుకోగా.. కల్వకోల్ రెండోస్థానంలో నిలిచింది. కబడ్డీలో మొదటి స్థానంలో ఏదుల, రెండోస్థానంలో చెన్నారం నిలిచింది. పెద్దబండలాగుడు పోటీల్లో వెంకటేశ్వర్‌రావుకు చెందిన ఎద్దులు (నాగర్‌కర్నూల్) మొదటి స్థానం, చక్రవర్తిగౌడ్‌కు చెందిన ఎద్దులు (గద్వాల) రెండోస్థానంలో నిలిచాయి. చిన్నబండ పోటీల్లో వడ్డెమాన్ ఆంజనేయులు (గద్వాల) మొదటి, నల్‌రెడ్డి (గద్వాల)కు చెందిన ఎద్దులు రెండో స్థానంలో నిలిచాయి.

కుక్కలు, కోతుల నుంచి రక్షణ కల్పించాలి

వనపర్తి విద్యావిభాగం: జిల్లా కేంద్రంలో కుక్కలు, కోతులు స్వైర విహారం చేస్తున్నాయని, వీటి ద్వారా ఇబ్బందులు పడుతున్న చిన్నపిల్లలు, మహిళలను రక్షించాలంటూ అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కొంతకాలంగా పట్టణంలో కుక్కల, కోతులతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్‌యాదవ్, వెంకటేశ్వర్లు, కొత్తగొల్ల శంకర్, గొనికడి యాదయ్య, గంధం భరత్, శివకుమార్, రమేష్ తదితరులు ఉన్నారు.

శుద్ధమైన తాగునీరు అందించాలి



వీపనగండ్ల: పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కలుషితం లేని శుద్ధమైన తాగునీటిని అందించినప్పుడే వారు ఆరోగ్యవంతంగా పెరుగుతారని మండల విద్యాధికారి నర్సింహులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్యూరిఫైర్ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. తాగునీరు, భోజనశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సాయిలత, ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాపోరాటాలతోనే సమస్యల పరిష్కారం

వనపర్తి రూరల్: సీపీఐ దేశంలో, రాష్ట్రంలో అధికారంలో లేకున్నా ప్రజల గుండెల్లో స్థానం ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. దేశంలో పార్టీ ఆవిర్భవించి వందేళ్లు అవుతుందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం అలుపెరగని పోరాటం చేసిందన్నారు. కార్మిక, కర్షక, పీడిత ప్రజల గొంతుకగా చట్టసభల్లో, బయట పోరాటం చేసిన ఘనత సీపీఐకే దక్కుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళావతమ్మ, శ్రీరామ్,రమేష్, గోపాలకృష్ణ, పృథ్వీనాథం, వంశీ, లక్ష్మీనారాయణ ఉన్నారు.

వీపనగండ్ల: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలతో మమేకమై ఉద్యమాలు నిర్వహించినప్పుడే పార్టీల మనుగడ కొనసాగుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. శుక్రవారం బొల్లారంలో పార్టీ జిల్లా శతజయంతి ఉత్సవాల కరపత్రాల విడుదల చేశారు. శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఈ నెల 23వ తేదీన జిల్లా కేంద్రంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు బాల్‌నర్సింహ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని, ర్యాలీలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కళావతమ్మ, మండల కార్యదర్శి వంకగోపాల్, నాయకులు కురుమయ్య, వేమన్న, కృష్ణయ్య, తిరుపతయ్య, శివ, వినోద్, కేశవులు, నాగేష్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



వనపర్తిలో మాట్లాడుతున్న విజయరాములు

ఆకట్టుకున్న కవి సమ్మేళనం

వనపర్తిటౌన్: మనసు లోతుల్లో దాగి ఉన్న భావాన్ని, అనుభవాన్ని, బాధను, లోతైన గాథల్ని వ్యక్తీకరించేందుకు అనుసరించే ఒక ప్రక్రియే కవిత అని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ పేర్కొన్నారు. ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకొని సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాకేంద్రంలో కవి సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనస్సులోని భావాలను అర్థవంతంగా కవిత రూపంలో మలిచే సామర్థ్యం కొందరికి మాత్రమే ఉంటుందని, అలా అరుదైన శైలిలో కవితలు రచించి పాఠకులను ఆకట్టుకున్న కవులు వనపర్తి జిల్లాలో ఎంతో మంది ఉన్నారని కొనియాడారు. అనంతరం 20 మంది కవులు కవితా గానం చేయగా.. వారికి నిర్వాహకులు కవితా గ్రంథాలను అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కవులు జనజ్వాల, శివరాజలింగం, బైరోజు చంద్రశేఖర్, వెంకటయ్య, సత్తార్, బాబుగౌడ్, ఉప్పరి తిరుమలేష్, తుర్పింటి నరేష్ కుమార్, బుచ్చిబాబు, వీరాచారి, నారాయణరెడ్డి, శివలింగం, అనంతప్ప, రాములు, రాంరెడ్డి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికల హామీలు విస్మరించారు'

మదనాపురం: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో విస్మరించిందని, ప్రజల సమస్యలపై దృష్టి సాధించడం లేదని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణయ్యయాదవ్ మండిపడ్డారు. శుక్రవారం మండలంలోని కొన్నూరులో తాగునీటి సమస్య తలెత్తడంతో కాలనీవాసులతో ఆరా తీశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహిళలకు రూ.2,500, కల్యాణ లక్ష్మిలో భాగంగా తులం బంగారం, అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ, విద్యార్థినులకు స్కూటీలు తదితర వాటిని అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారని ఎద్దేవా చేశారు. రామన్‌పాడు రైల్వే క్రాస్ వద్ద రైతులకు ఇబ్బంది కలిగే విధంగా అధికారులు రహదారిని మూసివేశారని, సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే రహదారిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు యాదగిరి, నాయకులు ఆనిమోని మాసన్న యాదవ్, బాలకృష్ణ, మనోజ్‌కుమార్, పెంటన్న, గోవర్ధన్ రెడ్డి, మురళి పాల్గొన్నారు.



కొన్నూరులో మాట్లాడుతున్న కృష్ణయ్య

రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

కొత్తకోట రూరల్: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని ప్రముఖ ప్రకృతి వ్యవసాయ నిపుణుడు విజయరాం అన్నారు. శుక్రవారం మండలంలోని నాటవెల్లి సమీపంలో గల మానవత గోఆశ్రమం వద్ద మానవతా విశ్వవిద్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రకృతి వ్యవసాయ నిపుణులు విజయరాం హాజరై ప్రకృతి వ్యవసాయంలో సుభాష్ పాలేకర్ విధానాన్ని వివరించారు. రైతులు ఆవును పెంచుతూ జీవామృతం తయారు చేసి మొక్కలకు వేయాలన్నారు. విశ్వమానవతా సంస్థ వ్యవస్థాపకుడు అల్లూరి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ప్రకృతి విలువలు పాటిస్తేనే మనిషి ఆరోగ్యంగా ఉంటాడన్నారు.

కార్పెంటర్ షాపు దగ్ధం చేసిన వ్యక్తిపై కేసు

కొత్తకోట రూరల్: రోడ్డు పక్కన తడకలతో ఏర్పాటు చేస్తున్న కార్పెంటర్ షాపుపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటన శుక్రవారం పెద్దమందడి మండలం మోజర్లలో చోటు చేసుకుంది. ఎస్ఐ యుగంధర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మోజర్లకు చెందిన వడ్ల విజయ్ గ్రామంలో రోడ్డు పక్కన తడకలతో కార్పెంటర్ షాపు షెడ్డు నిర్మించుకునేందుకు పనులు ప్రారంభించాడు. ఇదే గ్రామానికి చెందిన జైపాల్‌రెడ్డి తన ఇంటికి సమీపంలో కార్పెంటర్ షాపు ఉండటంతో శబ్దం వస్తుందని, వాదనకు దిగాడు. ఇద్దరి మధ్య గొడవ పెద్దదిగా కావడంతో ఆగ్రహానికి గురైన జైపాల్‌రెడ్డి వెంట తెచ్చుకున్న పెట్రోల్ పోసి షెడ్డును తగులబెట్టాడు. బాధితుడు వడ్ల విజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జైపాల్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పంచాయతీ కార్మికుల వినూత్న నిరసన

ఖిల్లాఘనపురం: పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని భిక్షాటన చేస్తూ గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు శుక్రవారం నిరసన తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన కార్మికులు ఖిల్లాఘనపురం బస్టాండుకు చేరుకొని దుకాణాలు, మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఒక్కో గ్రామ పంచాయతీలో ఒక్కో రకంగా 5 నుంచి 7 నెలల వరకు జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని వాపోయారు. అసలే చాలీచాలని వేతనాలతో బతుకుతున్న తమకు నెలల తరబడి జీతాలు ఇవ్వకుంటే ఎలా అని ప్రశ్నించారు.